

'గార్దభస్వర భూషణా'లనీ, 'ఖరకంఠీరవు'లనీ తరతరాలుగా తమ తాత ముత్తాతలసంగీత విద్వత్తును తూర్పారబోస్తున్నా, అవి తిట్లో, పొగడ్తలో తెలియని బాల్యం నుంచీ సంగీతమంటే చెవి గోసుకునే చంచయ్యకు నోరు తెరిస్తే పాడాలనిపిస్తుంది పాపం! సామగానం కూసువిద్యా మరి? కడుపు నిండా నేర్చుకోవాలి. నేర్చుకున్నా కోయిల కూతల్లా శృతిలో పలుకుతూ పక్కవాళ్ళనిట్టే రంజింపచేస్తుందన్న గ్యారంటీ అందరూ ఇవ్వగలరా? [illegible]దేచ్చ!

కానీ చంచయ్య పట్టు జలగపట్టు. వదల్లేదతను. పొద్దున్లేస్తే నిద్రపొయ్యేదాకా, వంశపారంపర్యంగా వాళ్ళ నాయనమ్మకొచ్చిన సరళీల దగ్గర్నుంచి, సబ్బులమ్మే పాటల్దాకా సాధన చేస్తూనే పోయేవాడు!

బాల్య చాపల్యం పోకపోయినా ఏళ్లొస్తూనే వున్నాయి. చదువు ముగిసింది కొద్దో గొప్పో. చనువిస్తే 'పాడ్తా'ననే వాడు స్కూల్లో కూడా! కొందరికది బెదిరింపులా భయపెట్టేది! కిటుకుతెలిసిన మరి కొందరు చంచయ్య సంగీతాన్ని తెగ పొగుడుతూవాడి 'సరిగమ' ల్లోని గరళాన్ని మందులా వాడుకునేవాళ్ళు!- అంటే మచ్చుకు- ఇంటద్దెకున్న అఘోరంగారు 'కావాలో- మొర్రో' అన్నా ఖాళీ చెయ్యకపోతే, పక్కింట్లో కూచుని చంచయ్యను పాడమనేవారు! ఓ వారంరోజుల్లో మరి మజా చూశారా! ఒక్క అఘోరమే కాదు- వారి ఇరుగూ పొరుగూ కూడా ఇళ్లు మారినట్టు పి.టి.ఐ. వార్త! మహామారిలాంటి మహత్తుందన్న మాట చంచయ్య పాటల్లో!

ఏటేటా వస్తాయి పర్వదినాలు.

పావనం చేస్తాయి భక్తిగల ప్రజానీకాన్ని. ఈ యేడూ పక్క వూళ్లో వినాయకచవితి సంబరాలు 'ధూమ్' 'ధామ్'గా జరుపుతారు. గల్లీ గల్లీలో గాత్రకచ్చేరీలేర్పాటు చేస్తున్నారు. వోట్లకోసం కోట్ల కట్టలు ఖర్చుబెడుతూ, ఎం.ఎల్.ఎ. కావాలని వువ్విళ్లూరుతున్నారు వుమామహేశంగారు. ఆయనకూ సంగీతానికి 'మార్జాల మూషిక' సంబంధమైనా, తన పనికోసం గాడిద కాళ్ళు పట్టుకున్న వసుదేవుడిలా, 'పాడ్తా'నన్న ప్రతి మొగాడికీ, (ముఖ్యంగా 'ముఫత్'గా దొరికిన వాళ్ళకు) వద్దనకుండా



"జ్యోతిర్మయి"

చిత్రం : పి. పి.నాయుడు

కొద్దో గొప్పో ఛాన్సిచ్చాడాయన. జనం చేరుకున్న కచ్చేరీల్లో మాత్రం గాలంతో చేపలు పట్టినట్టు, స్వయంగా వుమామహేశంగారో, లేదా తమ ఏజంట్లో, వినాయకుడి మహిమతోపాటు, ఎలక్షన్ల మహిమ రంగరిస్తూ సొంత డబ్బా కొట్టుకోవాలి. జనం రానిచోటుంటారా? పాడేవాళ్ళ ఖర్మ అది.

ఇంకేం!

చంచయ్య భాగవతార్‌గారి పాట కచ్చేరీ నిశ్చయమైంది! చంచయ్య ప్రతిభ ఇదివరకే తెలిసిన కొందరు "పిట్టవాలకుండా- విరోధి పక్షం వాళ్ళాయన్ను పాడిస్తున్నారేమో!" అనుకున్నారు. కానీ అసలు సంగతి- వుమామహేశంగారి సంగీత (అ)జ్ఞానమే దీనికి కారణమని వాళ్ళకూ తర్వాత తెలిసింది!

యావత్ప్రపంచంలోనే మొట్టమొదటి సారి ఆయన స్టేజెక్కబోతున్నాడంటే మాటలా మరి! మునుపో పేషంటు డాక్టర్ దగ్గరకెళ్ళి 'అయ్యా! ఇది నా మొదటి ఆపరేషన్. జాగ్రత్త స్వామీ!' అనగానే, డాక్టరూ అన్నాట్ట 'భయపడకోయ్! నేనూ మొదటి ఆపరేషనే చేస్తున్నాగా!'

కాగా-

పది రోజులకు ముందట్నుంచే వినా

యకుడి గుడి చుట్టూ నూటొక్క ప్రదక్షణాలు రోజూ చేసి, పాడబోయే పాటొక్కంటికీ నూటొక్కసార్లు వల్లించుకున్నాడు చంచయ్య.

ఇహ పాటెల్లా పాడినా విఘ్నానికి తావు లేదు!! సాయంత్రం కచ్చేరనగా, శాంతంగా, సావధానంగా సాధన చేసుకో వచ్చని, ఎడ్లబండిలో పయనిస్తూ, పాటలు మళ్ళీ వల్లిస్తూ, పరవశుడై, మెల్లమెల్లగా, సమయానికి కచ్చేరీ కార్యరంగం చేరుకున్నాడు చంచయ్య భాగవతార్! ఆ నాలుగు మైళ్ళూ నాలుగు తరాలుగా గడిచాయి బండివాడికి!.. .

అదొక పాత దేవాలయ శిథిలం.



ఆర్క్యాలజీ డిపార్టుమెంట్ వాళ్ళు అదుకున్నట్టు లేదు. చిమ్మినా పోని చెత్తా చెదారం తాలూకు సుగంధం సంవత్సరానికోసారైనా జనం అఘ్రాణించాల్సిందే ఇక్కడ! గుడిలోపల, మరొక విద్వాంసుడదివరకే పాడుతున్నాడు. పాట పాట మధ్య 'ఎలక్షన్' కబుర్లూ వినిపిస్తున్నాయ్! అప్పుడప్పుడూ 'విఘ్నేశ్వరుడికీ'- 'జై'- 'వృషామహేశ్వరుడికీ- జై-' అన్న నినాదాలు కూడా.

మద్దెల దరువుల్లో మత్తెక్కినట్టు చూస్తున్న చంచయ్యను, గుడి పక్క సందులో పాడమన్నారు. ఎక్కడైతేనేం- తనకు 'పాట్టం' ముఖ్యం. అంతే.

కచ్చేరి మొదలెట్టేదాకా, ' ఎప్పుడో కామాయమ్మగారమ్మాయి 'అరంగేట్రం' చూసిన చంచయ్యకు, తన ప్రీమియర్ పెర్‌ఫార్‌మెన్స్‌లోనూ అంతే ఎక్సైట్‌మెంట్ గనక- మూసిన కళ్ళు తెరిచినట్టే లేదు! మద్దెల దెబ్బతో మళ్ళీ స్మృతి వచ్చింది. ఒక్కసారి కుడి, ఎడమలకు మెడ తిప్పి పరికించాడు.

ముగ్గురే ముగ్గురు కూర్చున్నారు ఆడియన్స్‌లో!!!

(పక్క వాద్యాల వాళ్ళు కాకలేండి!)

చంచయ్యకు ఆర్గనైజర్ మీద పట్టరాని కోపం వచ్చింది. కానీ, సంగీత సృష్టికి కోపం వినాశకారణం గదా!- తన్ను తాను వోదార్చుకుని, శాంతంగా అనుకున్నాడు-

'ఇలాంటి సమయంలోనే ధైర్యం కావాలి. మహా మహాత్మ్యంగల విఘ్నేశ్వర భగవానుడి పుణ్యచవితిన ఎలాగైనా పాడి తీరాలి (కనీసం ముగ్గురైనా సంగీత ప్రియులున్నారు కదా, ఈ వూళ్ళో!)'

సంబాళించుకుని- పాట మొదలెడ్దామనుకుంటూ- ప్రేక్షకుల్లో కూచున్న మొదటి పెద్ద మనిషిని ప్రశ్నించాడు చంచయ్య 'అయ్యా! మీకు నా సంగీతమంటే, ఇవ్వాళ ఎందుకు వినాలనిపించిందో- మీరేమీ అనుకోకపోతే- కాస్త చెప్తారా?'

మొదటాయనన్నారు సీరియస్‌గా 'స్వామీ మీ సంగీతం మాట నాకు తెలీదు. మీ తర్వాత నన్ను పాడమని, ముందే డబ్బిచ్చి, పంపారిక్కడికి. అందుకే నే కూర్చున్నా'.

చంచయ్య కాదుర్దా పెరిగింది! 'థక్కు'న రెండో పెద్ద మనిషిని కూడా అడిగేశాడు మరి మీరెందుకూర్చున్నారని!

'మీరు కూర్చున్న తివాసీనాది. మీరు లేస్తే అది తీసుకుపోవాలి. పండగ ఫడావిడిలో ముందు జాగ్రత్త నయం గదండీ' అన్నాడాయన!!

మరి మూడో అయనో!?

'అంత మతి మరపైతే ఎల్లా బాబూ! దోవ పొడుగునా మా ఎడ్లు బెదురుతున్నా, మీరు పాడుకుంటూనే వచ్చారు. మిమ్మల్ని దేనికి కదల్చడం- కచ్చేరీ అయ్యాక మీరు 'ఫీజు' వసూల్చేసుకుంటే- నాకూ మరో నాల్గు కాసులెక్కువిస్తారేమో- వాపసుక్కూడా నా ఎడ్ల బండిలోనే తీసుకుపోదామని బండీ కూలీ అడక్కుండానే కూచుండిపోయానిక్కడ' అన్నాడతను!

ఇక చంచయ్య భాగవతార్‌గారి కచ్చేరిని గురించి పేపర్లల్లో విమర్శకులేం రాశారో మరి!

●